www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 163 | హైదరాబాద్ | ఆదివారం | 31-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## గత ప్రభుత్వంలో లేని పీపీటీ సంప్రదాయం.. ఇప్పుడెందుకు?



**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## వరదల మీద మాట్లాడుదాం అంటే.. బురద రాజకీయాలు మాట్లాడుకుందాం అంటున్నారు

**అసెంబ్లీలో ప్రజా సమస్యలపై**
**చర్చించకుండా పారిపోతున్నారని విమర్శ**
**వరదలపై చర్చకు వస్తే అధికార కాంగ్రెస్ పార్టీ**
**బురద రాజకీయం చేస్తోందని ఆగ్రహం**
**సమావేశాలు 15 రోజుల పాటు నిర్వహించాలని**
**బీఏసీలో కోరామన్న హరీశ్ రావు**

**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్):**

వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. బీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేసిన హరీశ్‌రావు.. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు.

వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సీటి పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటుంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. అంటే ఇవాళ రేపు, ప్రజా సమస్యల మీద చర్చించకుండా సభను వాయిదా వేసుకొని పారిపోతున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

వరదల మీద మాట్లాడదాం అంటే అది ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందాం అంటున్నారు. ఎరువులు, రైతుల మీద మాట్లాడుకుందాం అంటే తొందర ఏముంది.. మెల్లగా మాట్లాడుదాం అంటున్నారు. ప్రభుత్వం ముందుకు రాకపోవడం వల్ల బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైంది ఏముంటుంది..? వరద బాధితులు కాక ప్రధాన ఎంజెండా ఏముంటుంది..? ఎరువుల కొరత, వదరలపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రభుత్వ ధోరణి చూస్తే కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పెట్టి బురద రాజకీయాలకు పాల్పడే ఆలోచనలో కనబడుతున్నారు. దాని మీద చర్చకు సిద్ధం.. పీపీటీకి అవకాశం ఇవ్వండి.. ఒక్క రోజు కాదు నాలుగు రోజులు మాట్లాడుకుందాం అని చెప్పాం. కానీ కష్టాల్లో ఉన్న రైతులు, వరద బాధితులపై మాట్లాడాలంటే ముందుకు రావడం లేదు అని



కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

రేపు ఒక్క రోజే బీసీ బిల్లు, కాళేశ్వరం రిపోర్టుపై చర్చించి.. తర్వాత అసెంబ్లీ వాయిదా వేసుకుని పోతారట. ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. ఎరువుల మీద చర్చించడానికి, వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రానందుకు వాకౌట్ చేశాం. కనీసం 15 రోజులు సభ నిర్వహించాలి. రేపటి ఎజెండా కూడా చెప్పడం లేదు.. రాత్రి 10కి చెప్తారట. మరి ఎప్పుడు ప్రిపేర్ కావాలి. ప్రజాపాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా..? ఎజెండా నిర్ణయించకపోవడమేనా..? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. అర్థంపర్థం లేకుండా బీఏసీ సమావేశం జరిగింది. కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు.

## పీసీ ఘోష్ కాదు.. అది పీసీసీ ఘోష్ కమిషన్

ఎరువుల సంక్షోభంపై
గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన
ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్
ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు
కనీసం 15 రోజులపాటు
అసెంబ్లీని నడపాలని డిమాండ్
కాళేశ్వరం సహా అన్ని
అంశాలపై చర్చకు సిద్ధమని ప్రకటన
రైతుల సమస్యలను ప్రభుత్వం
పట్టించుకోవడం లేదని ఆరోపణ

**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్ ):** రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గన్‌పార్క్ వద్ద నిరసనకు దిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు ఖాళీ యూరియా బస్తాలతో అమరవీరుల స్థూపం వద్ద తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కనీసం 15 రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని, ఏ అంశంపైనైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.



ప్రభుత్వం సభను ఏకపక్షంగా నడిపించాలని చూస్తోందని, రైతుల సమస్యలపై చర్చ జరపకుండా తప్పించుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. "గత 10 ఏళ్లలో కేసీఆర్ పాలనలో ఎన్నడూ ఎరువుల కొరత రాలేదు. రైతులు క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి లేదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులు చెప్పులను, ఆధార్ కార్డులను లైన్లలో పెట్టే పరిస్థితి ఎందుకొచ్చింది?" అని ఆయన ప్రశ్నించారు. పండుగ రోజున కూడా రైతులు వర్షంలో తడుస్తూ ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయ సంక్షోభం, పంట నష్టపోయిన రైతుల సమస్యలపై అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. "రాష్ట్రంలో 600 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 75 లక్షల మంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. ఆరు గ్యారెంటీల నుంచి 420 హామీల అమలు వైఫల్యం వరకు అన్నింటిపై చర్చిద్దాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

**రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం**
**రిజర్వేషన్లపై గత ప్రభుత్వం విధించిన పరిమితిని**
**ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయం**
**కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా**
**ఎంపిక చేయాలని కేబినెట్ నిర్ణయం**

**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్):**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో రిజర్వేషన్‌పై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. దీని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎంపిక చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. గతంలో అమీర్ ఖాన్‌కు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈసారి ఆయన స్థానంలో అజారుద్దీన్‌కు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు కోదండరామ్, అజారుద్దీన్‌ల పేర్లను సిఫార్సు చేస్తూ గవర్నర్‌కు పంపించింది.



## సీలింగ్ ఎత్తివేత లీగల్‌గా నిలబడే అవకాశం లేదు

**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్):** కాంగ్రెస్‌కు బీసీరిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేతపై అవగాహన లేకుండా ముందుకెళ్తోందని దుయ్యబట్టారు. పంచాయతీల్లో రిజర్వేషన్లపై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయంపై తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన రఘునందన్ రావు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో హైకోర్టు ఇచ్చిన డెడ్ లైన్ తో సుప్రీం, హైకోర్టు తీర్పులు పరిగణనలోకి తీసుకోకుండా రిజర్వేషన్ల సీలింగ్ విషయంలో ప్రభుత్వం హడావుడిగా నిర్ణయం తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ నిర్ణయం లీగల్‌గా నిలబడే అవకాశం లేదన్నారు.



బీసీలుకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లులను రాష్ట్రపతి పెండింగ్ లో పెట్టటం ఆర్డినెన్స్ సైతం పెండింగ్ లో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోతో ముందుకు వెళ్లాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇవాళ నిర్వహించిన కేబినెట్ భేటీలో పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285(A)కు సవరణ చేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ ప్రకారమే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా ఈ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈక్రమంలో రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.


## ప్రతిపక్ష నాయకుడు బాధ్యతలు హరీష్ రావుకు అప్పగించాలి

**అసెంబ్లీ ఆవరణలో కోమటిరెడ్డి.. ఉత్తమ్ రెడ్డి సరదా సంభాషణ**
**కాలేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్ అసెంబ్లీలో మాట్లాడాలని డిమాండ్**
**ప్రతిపక్ష నేత హోదా అవసరమా? అని ప్రశ్నించిన కోమటిరెడ్డి**
**కెసిఆర్ రాకపోతే ప్రతిపక్ష నేతగా రాజీనామా చేయాలని సూచన**

**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్):**

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి మధ్య ఆసక్తికరమైన చిట్ చాట్ జరిగింది. రేపు అసెంబ్లీలో కాలేశ్వరం కమిషన్ నివేదిక ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇద్దరు నేతలు సరదాగా మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, “మా స్టార్ బ్యాట్స్‌మన్ నువ్వే” అని కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఉద్దేశించి చెప్పగా, వెంటనే స్పందించిన కోమటిరెడ్డి, “మా కెప్టెన్ నువ్వే” అంటూ ఉత్తమ్‌ను సంబోధించారు. తరువాత మీడియాతో మాట్లాడిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని కోరారు. ముఖ్యంగా కాలేశ్వరం ప్రాజెక్టుపై స్వయంగా అసెంబ్లీలోకి వచ్చి మాట్లాడితే ప్రజలకు స్పష్టత వస్తుందని అన్నారు.

అయితే ప్రతి అసెంబ్లీ సమావేశంలో హరీష్ రావు, కేటీఆర్‌లను మాత్రమే మాట్లాడమని కేసీఆర్ సూచించడం సరికాదన్నారు. అలా అయితే ప్రతిపక్ష నాయకుడి హోదా అవసరమా అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే ప్రతిపక్ష నేతగా రాజీనామా చేయాలని, అవసరమైతే ఆ బాధ్యతలను హరీష్ రావుకు అప్పగించాలన్నారు. రేపు అసెంబ్లీలో జరగబోయే కాలేశ్వరం కమిషన్ నివేదికపై చర్చకు ముందు కాంగ్రెస్ నేతల సరదా సంభాషణతో పాటు కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.



## ఆర్టీసీ ఆదాయానికి టికెట్

### టికెట్లు ఇవ్వకుండా చార్జీ డబ్బు స్వాహా చేస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు

అందినకాడికి దండుకునే
పనిలో అద్దె బస్సుల డ్రైవర్లు
ఉద్యోగం పోయినా పరవాలేదన్న
ధీమాతో సొమ్ము స్వాహా
పురుషులకూ జీరో టికెట్లిచ్చి దోపిడీ
చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు
తనిఖీ బృందాల సంఖ్య పెంచిన ఆర్టీసీ

**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్):**

ఆర్టీసీలో అద్దె బస్సులు నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థల డ్రైవర్లు కొందరు సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రయాణికుల నుంచి టికెట్ల డబ్బు వసూలు చేసి, వారికి టికెట్లు ఇవ్వకుండా ఆ సొమ్మును జేబులో వేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల పెరుగుతుండటంతో ఏం చేయాలో పాలుపోక ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తనిఖీ బృందాలను పెంచి విస్తృతంగా చెక్ చేయిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు దాటాక కొందరు డ్రైవర్లు ఈ తరహా దందా చేస్తుండటంతో అంతర్‌రాష్ట్ర తనిఖీ బృందాలను కూడా రంగంలోకి దింపారు.

**ఉద్యోగం.. పోతే పోతుంది**

ఆర్టీసీలో ఇటీవల అద్దె బస్సుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రైవేటు సంస్థల నుంచి బస్సులను అద్దెకు తీసుకుని కి.మీ.కు నిర్ధారిత మొత్తాన్ని చెల్లిస్తోంది. ఈ బస్సుల్లో డ్రైవర్లను బస్సు యజమానులే ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం 35 శాతం బస్సులు ఇవే ఉన్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య కూడా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం వీటికి రాయితీ ఇస్తూ టెండర్లు పిలిచి బస్సులు కేటాయిస్తోంది.

ఆ టెండర్ దక్కించుకునే బడా సంస్థలు బస్సులను ఆర్టీసీకి అద్దెకిస్తున్నాయి. వీటి డ్రైవర్లు ఇప్పుడు ఆర్టీసీకి రావాల్సిన టికెట్ సొమ్మును భారీగా స్వాహా చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్ తరహాలో రెగ్యులర్ ఉద్యోగం కాకపోవటంతో.. ఉద్యోగం ఉంటే ఉంటుంది, పోతే పోతుందన్న పద్ధతిలో వ్యవహరిస్తున్నారు. రోజుకు ఐదారు టికెట్ల డబ్బు స్వాహా చేయటం ద్వారా నెలకు యజమాని ఇచ్చే జీతం కంటే ఎక్కువ మొత్తం సమకూర్చుకోవచ్చన్నది వారి ఆలోచన.

ఎలక్ట్రిక్ బస్సులున్న అన్ని డిపోల్లో ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయి. దీంతో ఆర్టీసీ కూడా కఠినచర్యలకు దిగింది. దొరికిన డ్రైవర్ ఎంత మొత్తం కాజేశాడో తేల్చి అంతకు పది రెట్ల మొత్తాన్ని ఆ డ్రైవర్‌ను నియమించిన సంస్థకు పెనాల్టీగా విధించి వసూలు చేస్తున్నారు. ఆ డ్రైవర్ ఆర్టీసీలో మళ్లీ పనిచేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయినా ఇలాంటి కేసులు ఆగకపోవటంతో వారి లైసెన్సులను రద్దు చేసేలా రవాణాశాఖతో ఆర్టీసీ సంప్రదిస్తోంది.



**జీరో టికెట్ల దందా కూడా..**

**కొందరు ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు జీరో టికెట్లతో మాయ చేస్తున్నారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణం కింద జీరో టికెట్లు జారీ చేస్తారు. కొందరు ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు పురుష ప్రయాణికులకు కూడా జీరో టికెట్లు జారీచేస్తూ ఆ మొత్తాన్ని స్వాహా చేస్తున్నారు. జీరో టికెట్లకు సంబంధించి ఆర్టీసీకి డబ్బు జమ కట్టాల్సిన పని లేకపోవటంతో వారికి బాగా కలిసి వస్తోంది.**

**ఇటీవల తనిఖీల్లో పురుషుల వద్ద జీరో టికెట్లు దొరికాయి. దీంతో ఈ బండారం వెలుగు చూసింది. గతంలో సొంత కండక్టర్లు కొందరు ఇలా చేయగా, వారిని ఏకంగా డిస్మిస్ చేయటమే కాకుండా, అప్పీల్ అవకాశం కూడా లేకుండా చేశారు. దీంతో మిగతావారు ఆ దందాకు దూరంగా ఉన్నారు. కానీ, ఇటీవల ఔట్‌సోర్సింగ్ కండక్టర్లలో కొందరు ఆ తరహాలో డబ్బు కాజేస్తున్నారు.**

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ డుమ్మా..

**కాళేశ్వరం నివేదికపై చర్చ నేపథ్యంలోనే ఈ నిర్ణయం**
**ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేటీఆర్, హరీశ్‌రావుతో కీలక భేటీ**
**సభలో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం**
**పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు**
**అనుమతి కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**
**ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని**
**నిలదీయాలని పార్టీ శ్రేణులకు సూచన**



**హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్ ):** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదిక అసెంబ్లీని కుదిపేయనున్న తరుణంలో బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై జరిగే చర్చకు హాజరు కాకూడదని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ ను ఇరుకున పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ కేసీఆర్ సభకు గైర్హాజరు కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, సభకు రానప్పటికీ పార్టీని నడిపించే వ్యూహరచనలో ఆయన చురుగ్గా ఉన్నట్లు సమాచారం. నిన్న ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి కీలక సూచనలు చేశారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను, అసత్యాలను గట్టిగా తిప్పికొట్టాలని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లే, ఈసారి కూడా సభలో ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించేందుకు అవకాశం కోరాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను అనుమతి కోరారు.

# వృత్తి నిబద్ధత తోనే ఉద్యోగులకు గుర్తింపు

**సికింద్రాబాద్, ఆగస్టు 30 ( సిద్దిపేట పవర్ ):**

గాంధీ వైద్య కళాశాలలో శనివారం అసిస్టెంట్ డైరెక్టర్ జగదీశ్వర్, ఆఫీస్ సబార్డినేట్ రవి ప్రకాష్ పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర మాట్లాడుతూ.. ఎంతో క్రమశిక్షణతో జగదీశ్వర్, రవి ప్రకాష్ లు సేవలందించారని ఆమె అన్నారు. జగదీశ్వర్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించారని ఆమె అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సర్వసాధారణమని ఆయా కాలంలో వారు అందించిన సేవలు చిరకాలం గుర్తు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య గెజిటడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐ ఎన్ టి యూ సి 3194 రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేణుగోపాల్ గౌడ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవి శేఖర రావు, రాజారావు అడ్మినిస్ట్రేషన్ అధికారులు విక్టర్ ప్రవీణ్ సుబ్బారావు ఆఫీస్ సూపరింటెండెంట్ లు సురేష్ శివ, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించండి

**చేర్యాల ఎంపీడీవో**
**చిలుముల శ్రీనివాస్**


**చేర్యాల :** స్థానిక సంస్థల ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని చేర్యాల ఎంపీడీవో చిలుముల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టు, ఎన్నికల నిర్వహణపై మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ముసాయిదా నోటిఫికేషను విడుదల చేసినట్లు తెలిపారు. అందులో ఏమైన అభ్యంతరాలు ఉంటే 30న శనివారం సాయంత్రం లోపు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఎంపీడీఓగా వాటిని పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ కోసం జిల్లా పంచాయతీ అధికారికి సమర్పిస్తామన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన వార్డు వారీగా తుది ఫొటోతో కూడిన ఓటర్ జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఒక వార్డులోని ఓటు మరో వార్డులో ఉంటే వాటిని వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితా షెడ్యూల్ పై గ్రామ పంచాయతీలోని వార్డులు వారీగా తయారు చేసిన జాబితాపై అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ఆనంతుల మల్లేశం (బీఆర్ఎస్), మంజి మల్లేశం (కాంగ్రెస్), బూరుగు సురేష్ (బీజేపీ), అందే అశోక్ (సీపీఐ), కొంగరి వెంకట్ మావో సీపీఐ (ఎం), ఒగ్గు రాజు (టీడీపీ) అఖిలపక్షాల నాయకులు బండకింది అరుణ్ కుమార్, ఈరి భూమయ్య, వడ్లకొండ సంజీవులు, అందే నాని బాబు, రంగు శివ శంకర్, కాశెట్టి పాండు, ఆరుట్ల వినీత్, నంగి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి సాయం అందించిన ఎమ్మెల్యే

**చేర్యాల, ఆగస్టు 30 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో నిన్న రాత్రి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన ఎగుర్ల సాయిబాబు కుటుంబానికి అండగా నిలిచి వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేర్యాల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అనంతల మల్లేశం,తాజా మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్,వేచరేణి గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య,మరియు ఎంపీటీసీ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు



# వినూత్న ఆలోచనతో పంటలకు రక్షణ

- కుక్కలు మొరిగినట్లు శబ్దం చేసే మైకుతో పంటలకు రక్షణ
- మైకు శబ్దంతో తగ్గిన కోతుల బెడద

**నంగునూరు, ఆగస్టు 30 ( సిద్దిపేట పవర్ )**

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం రైతు వినూత్న ఆలోచన సిద్ధన్నపేట గ్రామానికి చెందిన రైతు కోతులు అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు వినూత్న ఆలోచన చేశాడు. సిద్ధన్నపేట గ్రామానికి చెందిన గుండెబోయిన కనకయ్య రెండు ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. కోతులు, అడవి పందులు పంటపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. దీంతో తన పంటను కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. కుక్కల అరుపులు గట్టిగా వినిపించే మైకు ఏర్పాటు చేసుకుని కోతులు, మొక్కజొన్న పంటను రక్షించుకుంటున్నాడు. కుక్కలు మొరిగినట్లుగా శబ్దం చేసే మైకును రూ.800 పెట్టి కొనుగోలు చేసి తన పొలంలో అమర్చాడు. ఈ మైలు నుంచి వచ్చే శబ్దం అచ్చం కుక్కలు అరుస్తున్నట్లుగానే ఉండడంతో కోతులు, అడవి పందులు మొక్కజొన్న చేనులోకి రావడం లేదు. మైక్ వాడుతున్న తర్వాత కోతుల బెడద తప్పిందని గుండెబోయిన కనకయ్య తెలిపాడు. రైతు ఆలోచనను గ్రామస్థులు అభినందించారు.



# అక్రమ నిర్మాణాలపై... కలెక్టర్ కు ఫిర్యాదు చేశాం

- కాల్వల పునరుద్ధరణపై ఇరిగేషన్ శాఖ దృష్టి పెట్టాలి
- అక్రమ వెంచర్లు, కబ్జాలపై కాంగ్రెస్ కు సంబంధం లేదు
- దమ్ముంటే ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ద్వారా ఫిర్యాదు చేయించండి
- నర్సారెడ్డి ని వివాదాల్లోకి లాగితే చట్టపరమైన చర్యలు
- మీడియా మిత్రులు వాస్తవాలు తెలుసుకొని వార్తలు పెట్టాలి
- గజ్వేల్ అభివృద్ధికి కాంగ్రెస్ సంపూర్ణ సహకారం అందిస్తుంది
- కాంగ్రెస్ నాయకుల స్పష్టికరణం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** వర్షాలతో గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని తూప్రాన్ రోడ్డు, ప్రజ్ఞాపూర్ రోడ్డు ముంపుకు గురి కాగా, తగు చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు తమ నాయకుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోజు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాజీ కౌన్సిలర్ నక్క రేగొండ గౌడ్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శివులు మాట్లాడారు. ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాల్వల ధ్వంసం అక్రమ నిర్మాణాల్లో కాంగ్రెస్ పార్టీకి గాని, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కి గాని ఎలాంటి సంబంధం ఏంటని ప్రశ్నిస్తున్నాం. ఆక్రమాలకు పాల్పడ నాయకులను వదిలిపెట్టి కొందరు పనిగట్టుకొని మీడియాను అడ్డం పెట్టుకుంటూ నర్సారెడ్డి పై దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. నిజంగా మీకు దమ్ముంటే ప్రతాప్ రెడ్డి చేసిన అక్రమల పై ప్రశ్నించాలి. మీడియా మిత్రులు సైతం వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని సూచించారు. ముఖ్యంగా ప్రజ్ఞాపూర్ ఊర చెరువు సర్వే నంబర్ 437, తూప్రాన్ రోడ్డులోని 597 సర్వే నంబర్లలో అక్రమ నిర్మాణాల తొలగింపుపై ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. అయితే ఈ అంశాలపై తగు చర్యలు నిమిత్తం సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తెస్తామని, లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తామని అన్నారు. గజ్వేల్ జల దిగ్బంధానికి కారణంగా నిలుస్తున్న పెద్దలు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని సూచించారు. అధికారులు చేపట్టే చర్యలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని, వెంటనే



సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని కోరారు.

గజ్వేల్ పరిధిలో నర్సారెడ్డికి ఒక ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తులు, స్థలాలు లేవని, ఒకవేళ ఉన్నట్టుగా నిరూపిస్తే వారికి బహుమతిగా ఇస్తామని స్పష్టం చేశారు. గజ్వేల్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లు లేరు. బిజెపి నాయకులకు ఎంపీ ఎమ్మెల్సీ ప్రజాప్రతినిధులుగా ఉండి. కేంద్రంలో 12 సంవత్సరాలుగా అధికారంలో ఉండి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ఒకటే పనిగా పెట్టుకోవడం జరిగింది వీళ్ళ పరిస్థితి చూస్తుంటే కొత్త బిచ్చగాళ్ల లెక ప్రవర్తిస్తున్నారు. ముఖ్యంగా కబ్జాదారులంతా బిజెపి టీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారు. ఈ విషయంలో బిజెపికి చిత్తశుద్ధి ఉంటే బిజెపి నుంచి ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తీసుకొని వస్తే మా నాయకుడు నర్సారెడ్డి కూడా వస్తారు. అందరం కలిసి కాలువలకు అడ్డం గా ఉన్న అక్రమ కట్టడాలను తొలగింపుకు ప్రభుత్వం ఉన్నతాధికారులను కలిసి అక్కమార్కుల పై ఫిర్యాదు చేసి న్యాయపోరాటం చేద్దా అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు మండల బాధ్యుడు సుఖేందర్ రెడ్డి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కర్ణాకర్ రెడ్డి వహీద్ యాదగిరి కొండ పోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్ పిఎసిఎస్ డైరెక్టర్ బాల్ రెడ్డి నాయకులు గుంటుకు శ్రీను గాడిపల్లి శ్రీను కొండల్ రెడ్డి ఉడెం శ్రీనివాస్ రెడ్డి జహంగీర్ ప్రేమ్ సమీర్ అఫ్రోజ్ కొడకల్లా బాలు అందిపూర్ బాలు సబ్బని నరేష్ తదితరులు ఉన్నారు.



# వేలంపాటలో రూ.18,500 లకు లడ్డు ను దక్కించుకున్న నానమ్మ

**కృష్ణవేణి స్కూల్ లో**
**ఘనంగా వినాయక నవరాత్రోత్సవాలు..**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 30 ( సిద్దిపేట పవర్ ):** సికింద్రాబాద్ భోలక్ పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ప్రతిష్టించిన వినాయక మండపంలో గణనాథుడి నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారం గణనాథుడి లడ్డూ వేలం పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ విద్యార్థుల కుటుంబసభ్యులు లడ్డూ వేలంపాటలో పాల్గొన్నారు. విద్యార్థులు ఎస్.సాయిచరణ్,నవనీత్ కుమార్,ధనస్వి ల నానమ్మ రాజేశ్వరీ హెచ్చు పాట పాడి రూ 18,500 లకు గణనాథుడి లడ్డూను దక్కించుకున్నారు. ఎంతో ఉత్సాహంగా లడ్డూ వేలంపాటలో పాల్గొని, లంబోదరుడి లడ్డును దక్కించుకున్న రాజేశ్వరీని పలువురు అభినందించి, సన్మానించారు. తమ పిల్లలకు చక్కటి విద్యా బుద్దులు రావాలని తాను గణేశుడి లడ్డు కోసం వేలంపాటలో పాల్గొన్నట్లు తెలిపారు. పాఠశాలలో గత ముప్పయి ఏండ్లుగా వినాయక నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు తెలిపారు.ఆదివారం వినాయక నిమజ్జనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మిస్ట్రెస్ వరలక్ష్మీ మంచాల, టీచర్లు,సిబ్బంది, పేరేంట్స్ పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల కష్టాలు

**ఉదయం నుంచి క్యూ కట్టిన రైతులు**
**అయినా దొరకని యూరియా బస్తాలు**

**నంగునూరు, ఆగస్టు 30 ( సిద్దిపేట పవర్ )**

యూరియా బస్తాల కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద శనివారం యూరియా టోకెన్లు జారీ చేయగా, టోకెన్ల వారీగా రైతు వేదిక వద్ద బస్తాలను పంపిణీ చేశారు. యూరియా బస్తాల కోసం వెయ్యి మందికి పైగా శనివారం తెల్లవారుజాము నుంచి క్యూ కట్టారు. వరుసలో నిలబడినప్పటికీ రైతులందరికీ సరిపోయే బస్తాలు దొరకక పోవడంతో రైతుల నిరాశతో వెనుదిరిగారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో రైతుల కష్టాలు తీరడం లేదు. ఇందుకు యూరియా కోసం రైతులు క్యూ కట్టడమే సజీవ సాక్ష్యం. కేవలం 560ల బస్తాలు మాత్రమే అందుబాటులో ఉండడంతో సగం మందికి కూడా యూరియా దక్కలేదు. రాజగోపాల్ పేట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గంటల తరబడి వేచి చూసిన రైతులు యూరియా దొరకదని తెలిసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వంపై ఆవేదనను వెళ్లగక్కారు. యూరియా అందుబాటులో లేక పంటల సాగుకు తాము ఇబ్బందులు పడుతుంటే, కొరత లేదని ప్రభుత్వం చెప్పడంపై రైతులు మండి పడ్డారు. ప్రభుత్వం సరైన ప్రణాళికతో యూరియాను అందుబాటులో ఉంచడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియాను రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. యూరియా లేక తమ పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



# కాలం చెల్లిన బీరు తాగి యువకుడికి అస్వస్థత

- ఆధారాలతో ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఎక్సయిజ్ అధికారులు
- జిల్లా లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- సిండికెట్ గా మారిన మద్యం మాఫియా
- సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ గుండ్ల శివచంద్రం

**సిద్ధిపేట :** కాలం చెల్లిన బీరు తాగి యువకుడు అస్వస్థతకు గురయిన సంఘటనలో సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులకీ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని సి ఆర్ సి చైర్మన్ గుండ్ల శివచంద్రం ఆరోపించారు. శనివారం సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో అయన మాట్లాడుతూ దుబ్బాక పట్టణ పరిధిలో ఉన్న రేణుక ఎల్లమ్మ వైన్స్ లో కాలం చెల్లిన బద్వైజర్ బీరు తాగిన యువకుడు అస్వస్థకు గురయ్యాడు. అతన్ని వెంటనే ఆసుపత్రి కి తరలించి వైద్యం అందించారని తెలిపారు. ఈ విషయం పై పూర్తి ఆధారాలతో సిద్ధిపేట ఎక్సయిజ్ సీఐ కి ఫిర్యాదు చేశామన్నారు. అయిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణదారులు సిండికెట్ గా మారి ఇష్టం వచ్చిన రెట్లకు, కాలం చెల్లిన మద్యం అమ్మిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయం పై సి ఆర్ సీ ప్రజాప్రయోజన వాజ్యం వేయనున్నట్లు తెలిపారు. దుబ్బాక సీఐ, ఉన్నతధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. సమావేశం లో సంస్థ సభ్యులు చరణ్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



# పౌరహక్కులు బలహీన వర్గాల పౌరుల ఆయుధాలు

**నంగునూరు ఆగస్టు 30 ( సిద్దిపేట పవర్ )**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖాతా గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ అధికారి చిలుక మహేందర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహిపాల్ తో పాటు అంగన్వాడీ కార్యకర్త, ఆశావర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ మహేందర్ మాట్లాడుతూ ప్రతి పౌరునికి సమానత్వం, గౌరవం, వివక్ష లేకుండా జీవించే హక్కుల పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా బలహీన వర్గాల వారికి రక్షణ చట్టాల గురించి తెలిసి ఉండాలన్నారు. గ్రామంలో దేవాలయాలు, దుకాణాలు, బోరుబావులు, పాఠశాలల వంటి




ప్రజా ప్రదేశాల్లో దళితులను నిరాకరించడం లాంటి సంఘటనలు జరిగితే మా దృష్టికి తేవాలని కోరారు. కులమత భేదాలు లేకుండా అందరం కలిసి మెలిసి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**బిజెపి నంగునూరు**
**మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి**

**నంగునూరు, ఆగస్టు 30 ( సిద్దిపేట పవర్ )**

నంగునూర్ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ బీహార్ ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి గురుంచి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ నంగునూర్ మండల శాఖ తీవ్రంగా ఖండిస్తుంది వెంటనే రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. ఇందులో ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి రావు, జిల్లా కిసనమోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రాజినికర్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి ,నరేష్ , సతీష్ గౌడ్, పరమేశ్వర రెడ్డి, యాదగిరి, భూపాల్ రెడ్డి, శ్రీకాంత్ , కృష్ణ ప్రసాద్, శ్రీకాంతాచారి పాల్గొన్నారు





## స్నేహితుడు చనిపోవడం చాలా బాధాకరము.

**సిద్దిపేట పవర్:** తమతో పాటు చదువుకున్న స్నేహితుడి మరణించిన విషయం తెలుసుకొని ఇంటర్ మిత్ర బృందం ఆ కుటుంబానికి శనివారం రోజున రూ.24 వేల సాయం అందజేశారు. బండ చర్లపల్లికి చెందిన పోతారాజుల నరేష్ నూ జనరేషన్ కళాశాలలో ఇంటర్ చదువుకున్నాడు. వారం రోజుల క్రితం మృతిచెందాడు. వారి స్నేహితులు ఆ కుటుంబానికి రూ.24 వేల సాయం అందజేశారు. స్నేహితులు మాట్లాడుతూ.. తమతో పాటు చదివిన స్నేహితులకు ఏ ఇబ్బందులు వచ్చినా తాము ఆదుకుంటామని తెలిపారు. గతంలో తోటి మిత్రులకు చాలమందికి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు.




## తండ్రి మరణం.. తల్లి అదృశ్యం...

- గాంధీలో దైన్యస్థితిలో మూడేండ్ల చిన్నారి
- రెండు రోజుల తర్వాత మేనమామల చెంతకు కార్తీక



**సికింద్రాబాద్, ఆగస్ట్ 30 ( సిద్దిపేట పవర్) :**మూడేళ్ల చిన్నారికి పెద్ద కష్టమే వచ్చింది. లోకజ్ఞానం ఎరుగని చిన్నారి తండ్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో మృతిచెందగా, మానసిక ఆందోళనతో తనని విడిచిపెట్టి తల్లి ఎటో వెళ్లిపోయింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న పాపను సెక్యూరిటీ సిబ్బంది చేరదీశారు. పత్రికల్లో వచ్చిన వార్త కథనాలను చూసిన పాప మేనమామలు సికింద్రాబాద్ కు వచ్చి పాపను తీసుకొని వెళ్లారు.. వివరాలు ఇవి. నారాయణపేట జిల్లా కోస్గి గ్రామానికి చెందిన బాబు (35), శాంత(31) లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుర్లు. ఈనేపథ్యంలో ఇటీవల ప్రమాదంలో గాయపడిన బాబు చికిత్సకై గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దాంతో భర్త చనిపోయిన బాధలో డిప్రెషన్ కు గురైన భార్య శాంతమ్మ చిన్నారి కూతురు కార్తీకను గాంధీలో వదిలిపెట్టి ఎటో వెళ్ళిపోయింది. గాంధీ క్యాంటిన్ వద్ద ఏడుస్తూ కనిపించిన చిన్నారిని చూసిన సెక్యూరిటీ సిబ్బంది చేరదీసి, చిలకలగూడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారి తప్పిపోయిన వార్త కథనం శనివారం పత్రికల్లో ప్రచురితం కావడంతో వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం చిల్మల్ మైలారం గ్రామానికి చెందిన పాప మేనమామలు చూసి శనివారం సాయంత్రం గాంధీ ఆసుపత్రికి వచ్చారు. అక్కడి నుంచి చిలకలగూడ పోలీస్ స్టేషన్ కు వెళ్ళి ఇన్స్పెక్టర్ అనుదీప్, ఎస్.ఐ రాకేశ్ లను కలిసి, జరిగిన సంఘటనలను వివరించారు. గాంధీ సెక్యూరిటీ చీఫ్ శివాజీ పాప కార్తీకను తీసుకొని పీఎస్ కు వెళ్ళి పోలీసుల సమక్షంలో పాప కార్తీక మేనమామలు శేఖర్, నర్సయ్య లకు అప్పగించారు. స్వగ్రామంలోని సర్పంచికి ఫోన్ చేసిన పోలీసులు పాప కుటుంబసభ్యులను నిర్ధారించుకొని, వివరాలను సరిపోల్చుకున్నారు. చిన్నారిని చేరదీసి రెండురోజుల పాటు ఆలన,పాలన చూసిన గాంధీ సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు. ఓవైపు కన్నతండ్రిని కోల్పోయి, మరో వైపు తల్లి అదృశ్యం కావడం పట్ల చిన్నారి ధైన్య స్థితిని చూసిన పలువురు కంటతడిపెట్టారు.

## అనాజ్ పూర్ లో పేదల 125 ఎకరాల భూమిని ప్రభుత్వం లాక్కోవడం అన్యాయం

**సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ని గృహనిర్బంధం చేసిన పోలీసులు**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 30 ( సిద్దిపేట పవర్) :** రంగారెడ్డి జిల్లాలోని అనాజ్ పూర్ గ్రామంలో పేదలకు చెందిన 125 ఎకరాల భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటుందని, దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఈ మేరకు శనివారం అనాజ్ పూర్ గ్రామానికి చెందిన రైతులు స్థానికులు చలో అసెంబ్లీ పిలుపు ఇవ్వడంతో బోలక్ పూర్ లోని సిపిఎం కార్యాలయంలో గాంధీనగర్ పోలీసులు జాన్ వెస్లీని గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రామోజీ ఫిలిం సిటీ సమీపంలో ఉన్న అనాజ్ పూర్ గ్రామస్తులకు అనేక ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 125 ఎకరాలను పేద రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు తాజాగా అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 125 ఎకరాల భూమిని తిరిగి లాక్కొని దానిని టూరిజం డెవలప్మెంట్ పేరుతో రామోజీ ఫిలిం సిటీకి అప్పగించాలని చూస్తున్నదని అన్నారు. దీనిపై అక్కడ రైతులు కొంతకాలంగా నిరసన ప్రదర్శనలు ధర్నాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని, వారికి తాము మద్దతుగా నిలిచావని అన్నారు. ఇప్పటికే వేలాది ఎకరాలలో ఉన్న రామోజీ ఫిలిం సిటీ లో సినిమా షూటింగ్ ల వ్యాపారాలు చేస్తూ కోట్లాది రూపాయలు ఆదాయాన్ని సంపాదిస్తుందని, వారికి అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో 350 ఎకరాలను వారికి అప్పగించడానికి కుట్ర పన్నిందని అన్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరానికి రూ.5 కోట్ల విలువ కలిగి ఉన్నదని, అందుకే అనాజ్ పూర్ కు చెందిన పేద రైతుల భూములను లాక్కుంటుందని, వారికి పట్టా పుస్తకాలు కూడా ఇవ్వడం లేదని, భూమి యజమానుల వివరాలను ఆన్ లైన్ లో పొందుపరచడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రైతులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పడానికి చలో అసెంబ్లీ చేపట్టిందని, వారికి న్యాయం లభించేంతవరకు సిపిఎం పార్టీ వారికి అండగా నిలబడి న్యాయ పోరాటంలో పాల్గొంటుందని జాన్ వెస్లీ అన్నారు







# నూతన కోర్టు భవనాలను ప్రారంభించిన హై కోర్టు జడ్జిలు

- సత్వర న్యాయం పరిష్కారం జరిగేందుకు కృషి చేయాలి
- తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్ల కార్తీక్










**సిద్దిపేట పవర్ సిద్దిపేట బ్యూరో:** సిద్దిపేట కోర్ట్ భవనంలోని 3,4 వ అంతస్తులో నూతనంగా నిర్మించిన సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ కం జుడిష్యల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ భవనాన్ని శనివారం తెలంగాణ హైకోర్టు జడ్జ్ లు జడ్జ్ పుల్ల కార్తీక్, బి. విజయసేన రెడ్డి మరియు జస్టిస్ శ్రవణ్ కుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆరా కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జస్టిస్ పుల్ల కార్తీక్ మాట్లాడుతూ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవన నిర్మాణానికి కృషి చేసిన వారిని అభినందించారు. అదనపు భవనంలో ఏర్పాటు చేసిన కోర్టు ద్వారా కక్షిదారులకు సత్వర వేగవంతమైన న్యాయాన్ని అందించాలని. బార్ అసోసియేషన్ మరియు కోర్ట్ బెంచ్ ఆరోగ్యవంతమైన సంబంధాలతో ముందుకు సాగాలని, అప్పుడే న్యాయం అందుతుందని ఆక్షించారు.జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి మాట్లాడుతూ, 20 సంవత్సరాల క్రితం సివిల్, క్రిమినల్ కేసుల విచారణ క్లిష్టంగా ఉండేదని, ఒక లాయర్ కేసు విషయంలో భిన్నమైన కోణాల్లో విచారిస్తారని కానీ జడ్జి నిర్ణయం అల్లా ఉండదని, పూర్తి చట్టబద్ధంగా, చట్టంలో లక్ష్మణరేఖ దాటకుండా తీర్పును అందించాల్సి ఉంటుందని అన్నారు. న్యాయం కోరుతూ కోర్టులకు వచ్చే ప్రజలకు అసంపూర్తిని కల్పించకూడదని అన్నారు. సిద్ధిపేట జిల్లా అద్భుతమైన ప్రగతిని సాధించిందని, ప్రతి ఒక్క న్యాయవాది సాధికారతను సాధించే దిశగా కృషి చేయాలని, ఇరువర్గాల కక్షి దారులకు న్యాయం చేకూరేలా చూడాలని కోరారు. జస్టిస్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా ప్రజాపరిపాలన అధికంగా మహిళల చేతుల్లో ఉండడం గౌరవంగా ఉందని, అదేవిధంగా మహిళా న్యాయవాదులు కూడా రావాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరు రాజ్యాంగాన్ని చదవాలని, ఇది తెలుగులో కూడా అందుబాటులో ఉందని, రాజ్యాంగం చదివితే మీకు కలిగే హక్కులు, విధులను గురించి మాత్రమే కాకుండా , ప్రజాస్వామ్యంలో చురుకైన పాత్ర పోషించగలరని అన్నారు. న్యాయం ఎవరికైతే అవసరమో దానికి సంబంధించిన విషయాలను చట్టాన్ని గురించి తెలుసుకోవడం ద్వారా సులువుగా మనల్ని మనం పరిక్ష్కరించుగలరని అన్నారు. కార్యక్రమాల్లో చివరగా ఉత్తమ సేవలను అందించిన పలువురు కోర్టు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు, అనంతరం జిల్లా న్యాయమూర్తులు మరియు జిల్లా కలెక్టర్ మరియు అదనపు కలెక్టర్లు, పోలీస్ శాఖ అధికారులు ముఖ్య అతిథులను శాలువా, మొమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్, సెన్సేషన్ జడ్జ్ సాయి రమాదేవి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సిపి అనురాధ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హేచ్. జనార్ధన్ రెడ్డి, గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.





## జోనల్ స్థాయి గణిత విజ్ఞానమేల లో సత్తా చాటిన సిద్దిపేట సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు

**సిద్దిపేట పవర్ సిద్దిపేట బ్యూరో:** జోనల్ స్థాయి గణిత విజ్ఞానమేల లో సిద్దిపేట సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు సత్తా చాటీనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెతుకు నరేష్ కుమార్ చెప్పారు ప్రయోగాలు,పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మరియు క్విజ్ కాంపిటీషన్ లలో పాల్గొని ప్రయోగాలలో కొయ్యడ హరి నందన్ 5వ తరగతి మొదటి బహుమతి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో రావణ వేణి ఎత్విక మొదటి బహుమ మరియు కనోజు లక్ష్మీహంసిని 6వ తరగతి రెండో బహుమతులు సాధించడం ఆనందంగా ఉంది అని పాఠశాల ప్రధానాచార్యులు మోతుకు నరేష్కుమార్ గారు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానపరమైనటువంటి అన్ని అంశాలలో ప్రథమ స్థానంలో నిలవడం వారి యొక్క వ్యక్తిగత అభివృద్ధిలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సిద్దిపేట నుండి మొత్తం 14మంది విద్యార్థులు ఇద్దరు ఆచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లడం జరిగినట్లు చెప్పారు




## ఎన్నికల ముసాయిదా పై ఆల్ పార్టీ మీటింగ్

**సిద్దిపేట పవర్ నంగునూరు ఆగస్టు 30:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ముసాయిదా పై ఎంపీడీవో వేణుగోపాల్ వివిధ పార్టీల నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకులు హాజరై ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాల పై చర్చించారు ఓటర్ లీస్ట్ లో పేరు ఒకరిది ఫోటో మరోకరిది ఉంటుందని అలాగే ఓకే కుటుంబానికి చెందిన వారి పేర్లు మరొక్క వార్డులో పేరు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే ఒక్క చోటికి మార్చాలని ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు మరణించిన వారి ఓట్ల జాబితాను లీస్టుల నుండి తొలగించాలని కోరారు ఓటర్ జాబితా సవరణకు మరో 10 రోజులు సమయం ఇవ్వాలని పలువురు నాయకులు ఎంపీడీవోను కోరారు రాజకీయ నాయకుల అభ్యంతరాలను జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఆనగోని లింగం గౌడ్, తప్పేట శంకర్, వెంకట్ రాంరెడ్డి, మహేందర్, కనకయ్య, వెంకట్ రెడ్డి, తిరుపతి రావు, రజినీకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు



## బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా లింగంపల్లి యాదగిరి



**సిద్దిపేట పవర్ , సిద్దిపేట బ్యూరో:** బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా లింగంపల్లి యాదగిరి గారిని ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి లక్నోలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా గత 30 సంవత్సరాలుగా పార్టీలో పని చేస్తూ ఉమ్మడి మెదక్ జిల్లాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లింగంపల్లి యాదగిరి నిరంతరం ప్రజా సమస్యల పైన పోరాడుతూ బహుజనుల అంతిమ లక్ష్యం రాజ్యాధికారం అని తెలియజేస్తూ తనకు ఈ అవకాశం ఇచ్చిన జాతీయ అధ్యక్షురాలు మాయావతి గారికి మరియు జాతీయ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ రావు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులుకు రాష్ట్ర కమిటీ నాయకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పదవితో తన బాధ్యత మరింత పెరిగిందని భవిష్యత్తులో ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేకంగా సిద్దిపేట జిల్లాలో బీఎస్పీ పార్టీ పేద ప్రజల పక్షపాతిగా ఉంటూ బహుజనులకు రాజ్యాధికారం బిఎస్పి తోనే సాధ్యమని వారు అన్నారు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

## సెర్ప్ సిబ్బంది జిల్లాలో విధులు సక్రమంగా నిర్వహించాలి



**సిద్దిపేట పవర్, సిద్దిపేట బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేశారు. జిల్లాలోని సెర్ప్ సిబ్బంది లో ఎల్ 2, ఎల్ 1, ఎంఎస్ సీసీఎస్ 115 మంది ఉద్యోగులకు శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కౌన్సిలింగ్ నిర్వహించి, బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సెర్ప్ సిబ్బంది జిల్లాలో విధులు సక్రమంగా నిర్వహించాలని, మహిళా సంఘాలను బలోపేతం చెయ్యడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో దాదాపు అన్ని మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ ఇవ్వడం జరిగింది. స్టీల్ బ్యాంక్ తప్పనిసరిగా ఉపయోగించుకునేలా సంఘాలతో మీటింగ్ లో చర్చించి స్టీల్ బ్యాంక్ ఉపయోగించే సంఘాలను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి మహిళ సంఘాల వారిగా ఒక రిజిస్టర్ పెట్టీ ఎక్కడ ఏ ఏ కార్యక్రమాల్లో ఉపయోగించారు ఎంత ఆదాయం వచ్చింది అనే విషయాలు రాసుకోవాలి. జిల్లాలో ఉత్సాహం ఉన్న మహిళా సంఘాలు స్టీల్ బ్యాంక్ కావాలంటే తప్పకుండా ఇవ్వడానికి తయారుగా ఉన్నాం. సీజనల్ వ్యాధులు లో డెంగ్యూ కేసుల వలన జిల్లాలో ప్రాణాలు కోల్పోయారు. మీమీ క్లస్టర్ ల వారిగా ప్రజలను అవగాహన కల్పించాలి. డ్రై డే కార్యక్రమంలో ప్రజలకు చెప్పడం తో పాటు చేసి చూపించి చుట్టు పరిసరాల్లో నీటి నిల్వ లో దోమల లార్వా డెవలప్ కావడం వలన డెంగ్యూ ఎటాక్ అవుతుందని ఫీవర్ ఇతరత్ర స్మింటమ్స్ వస్తె అర్ ఏం పి ల దగ్గరికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలా మోటివేషన్ చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, అడిషనల్ డీఆర్డీఓ సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# స్పైసీ ఇడ్లీ.. పిల్లలకు తెగ నచ్చేస్తాయి..

ఇడ్లీ.. పిల్లలకు అస్సలు నచ్చని ఆహారంలో టాప్‌లో ఉంటుంది. తినే వాళ్లూ కూడా రోజూ వీటినే పెడితే.. ఎప్పుడూ ఇవే చప్పటి ఇడ్లీలు తినాలా..? అని విసుక్కుంటారు. తినడానికి అయిష్టత ప్రదర్శిస్తారు. అంతేకాకుండా రుచికరంగా ఏమైనా చేసి పెట్టచ్చు కదమ్మా.. అని అడుగుతారు. పిల్లలు ఇలా తరచూ అడుగుతున్నారా? అయితే ఈ స్పైసీ ఇడ్లీ రెసిపీ మీకోసమే. మీరు ఎప్పుడూ చేసే మామూలు ఇడ్లీలతోనే ఇంట్లో వాళ్లకీ నచ్చేలా కొత్తగా ఒక పదార్థాన్ని తయారు చేయచ్చు. ముఖ్యంగా పిల్లలు ఇష్టంగా తినేలా స్పైసీగా, ఈజీగా చేసి పెట్టచ్చు. ఉదయాన్నే ఇడ్లీలు తినడం నచ్చకపోయినా, సాయంత్రానికి ఇడ్లీలు మిగిలిపోయినా ఇలా స్పైసీ తవా ఇడ్లీలను తయారు చేసి పెట్టండి.ఈ రెసిపీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా, సాయంత్రం స్నాక్స్‌గా ఉపయోగపడే స్పైసీ తవా ఇడ్లీని ఎలా తయారు చేయాలో చూసేద్దాం రండి..

## కావాల్సినవి..

శనగపప్పు రెండు టేబుల్ స్పూన్లు
మినపపప్పు రెండు టేబుల్ స్పూన్లు
ఎండు కొబ్బరి ముక్కలు రెండు టేబుల్ స్పూన్లు
బియ్యం ఒక టేబుల్ స్పూన్
నవ్వులు ఒక టేబుల్ స్పూన్
మిరియాలు
ఎండు మిర్చీ 5 లేదా 6
పుట్నాలు
చింతపండు
ఇడ్లీలు
బటర్ లేదా నెయ్యి లేదా నూనె రెండు టేబుల్ స్పూన్లు
ఆవాలు 1/2 టీస్పూన్
జీలకర్ర 1/2 టీస్పూన్
కరివేపాకు తాళింపుకు సరిపడా
తరిగిన ఉల్లిపాయ ఒకటి
తరిగిన టమాటా ఒకటి
తరిగిన పచ్చిమిరపకాయలు రెండు
పసుపు 1/2 టీస్పూన్
కారం పొడి 1/2 టీస్పూన్
ఉప్పు రుచికి తగినంత
తరిగిన కొత్తిమీర

## తయారీ విధానం..

ముందుగా మనం రోజూ చేసుకున్నట్లే ఇడ్లీలను చేసి పక్కక్కు పెట్టుకోవాలి.
తరువాత శనగపప్పు, మినపపప్పు,పుట్నాలు ఎండు కొబ్బరి ముక్కలు, బియ్యం, నువ్వులు, ఎండిమిర్చీలు, మిరియాలు అన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటి తీసుకుని వేయించాలి.
ఈ మసాలా దినుసులన్నీ చల్లారిన తర్వాత ఒక మిక్సీ జార్ లోకి తీసుకుని దాంట్లో చింతపండు వేసి మెత్తటి పౌడర్ లాగా చేసి పక్కక్కు పెట్టేయండి.
ఇప్పుడు మనం తయారు చేసుకున్న ఇడ్లీలను ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని పిల్లలకు నచ్చే విధంగా రకరకాల షేపుల్లో కట్ చేసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల పిల్లలు మరింత ఇష్టంగా తింటారు.
తరువాత ఒక ఫ్రైయింగ్ ప్యాన్ తీసకుని దాంట్లో రెండు టేబుల్ స్పూన్ల బటర్ లేదా నెయ్యి వేయాలి. ఇవి రెండూ లేకపోతే నూనె పోయండి.
నూనె వేడెక్కిన తర్వాత దాంట్లో ముక్కలుగా చేసుకున్న ఇడ్లీలను వేసి వేయించాలి. ఇడ్లీలు కాస్త క్రిస్పీగా, రంగు మారేంత వరకూ వేయించి పక్కక్కు పెట్టుకోవాలి.
తరువాత అదే ఫ్రైయింగ్ ప్యాన్లో ఒక టేబుల్ స్పూన్ నూనె లేదా నెయ్యి వేయాలి.
నెయ్యి వేడిక్కిన తర్వాత అందులో జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి.
తరువాత దాంట్లోనే తరిగిన ఉల్లిపాయలు వేయాలి.
ఉల్లిపాయలు గోధుమ రంగులోకి మారేంతవరకూ వేయించుకున్న తర్వాత దాంట్లో పచ్చిమిర్చీ వేసి వేయించాలి.
పచ్చిమిర్చీ కూడా చక్కగా వేగిన తర్వాత దాంట్లో సన్నగా తరిగి పెట్టుకున్న టమాటాలు వేసి వేయించాలి.
టామాటాలను పూర్తిగా వేయించుకున్న తర్వాత దాంట్లో మనం మనం ముందుగా తయారు చేసుకున్న మసాలా పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
వీటిని పచ్చి వాసన పోయేంత వరకూ వేయించిన తర్వాత ముక్కలుగా చేసి పక్కక్కు పెట్టుకున్న ఇడ్లీలను దీంట్లో వేయాలి.
మనం వేసుకున్న మసాలాలు అన్నీ ఇడ్లీలకు పట్టేంత వరకూ వాటిని ఫ్రై చేయాలి.
ఇడ్డీలు వేగిన తర్వాత రుచి చూసి ఉప్పు కారం తగ్గితే మరింత వేసుకువాలి. మిగిలిపోయిన ఇడ్లీలు అయితే పుల్లగా ఉంటాయి కనుక కాస్త ఎక్కువ మసాలాలు అసవరం అవుతాయని గుర్తుంచుకోండి.
ఇడ్లీలు చక్కగా వేగిన తర్వాత తరిగి పెట్టుకున్న కొత్తిమీరను వేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.
అంతే స్పైసీగా ఉండే తవా ఇడ్లీ తయారయినట్లే. వేడి వేడిగా సర్వ్ చేసి తినేయచ్చు. పిల్లలకు బాక్సుల్లోకి కూడా పెట్టేయచ్చు.





# నోరు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఇలా చేయండి

**నోరు ఆరోగ్యంగా ఉటే మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సుకు కృషి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పొద్దున్నే లేచి బ్రష్ చేసుకున్న అనంతరం మౌత్‌వాష్‌తో నోరు పుక్కిలిస్తుంటారు. దంతాలు-చిగుళ్ల ఆరోగ్యానికి, నోటి దుర్వాసనను దూరం చేయడానికి ఈ ప్రక్రియ బాగా తోడ్పడుతుందంటున్నారు. నిపుణులు. సాధారణంగా మార్కెట్లో దొరికే మౌత్‌వాష్‌లలో ఉండే రసాయనాల గాఢత నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. అందుకే మన వంటింట్లోనే దొరికే కొన్ని రకాల నూనెలతో నోటిని పుక్కిలించడం వల్ల నోరు శుభ్రపడడమే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి.**



**ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియతో ప్రయోజనాలు :** మన నోటిలో వందల కొద్ది సూక్ష్మక్రిములు ఉంటాయి. అందులో కొన్ని హానికరమైనవి ఉంటాయి. ఆ సూక్ష్మక్రిములు పంటి నొప్పి, చిగుళ్లకు సంబంధించిన వ్యాధులతో పాటుగా నోటి దుర్వాసనకు కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ ఇలాంటి బ్యాక్టీరియాను తొలగించగలదని తాజాగా నిర్వహించిన కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. నోటిని మంచిగా శుభ్రపరచుకోకపోవడంతో నోటి ఇన్ఫెక్షన్లు, చిగుళ్లలో సమస్యల వల్ల నోటి దుర్వాసన రావడం కామన్ అని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ సమస్య నుంచి బయటపడటానికి మార్కెట్ లో దొరికే మౌత్‌వాష్‌ల కంటే మన వంటింట్లో లభించే నూనెలే సమర్థంగా పనిచేస్తున్నట్లు మరో పరిశోధనలో వెల్లడైంది.

**ప్రతిరోజు ఆయిల్ పుల్లింగ్ :** చక్కెరకు సంబంధించిన ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవడం, దంతాల మధ్య చిక్కుకున్న పదార్థాల అవశేషాలను తొలగించుకోకపోవడం వల్ల పళ్లు పుచ్చిపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. ఇలాంటి సమస్య నుంచి విముక్తి లభించడానికి నిపుణులు సూచించే అద్భుతమైన చిట్కా ఆయిల్ పుల్లింగ్. ప్రతి రోజూ ఉదయాన్నే బ్రష్ చేసుకున్న తర్వాత ఆయిల్ పుల్లింగ్ చేయడం ద్వారా రంధ్రాలకు కారణమయ్యే బ్యాక్టీరియా నశిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో చిగుళ్లలో వాపు, రక్తస్రావం లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి వారు ఆయిల్ పుల్లింగ్‌తో ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. దంతాల మీద పేరుకున్న పాచి, పసుపుదనాన్ని తొలగించడంతో పాటుగా పళ్లను మెరిపించడానికి ఈ పద్ధతి చక్కగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ వల్ల దవడ, మెడ కండరాలకు చక్కటి వ్యాయామం అందుతుందంటున్నారు. తద్వారా ఆయా భాగాల్లో ఏదైనా నొప్పి ఉంటే తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆయిల్ పుల్లింగ్‌కు ఆలివ్, కొబ్బరి, నువ్వుల నూనెలు ఉత్తమ ఎంపిక. వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకొని టేబుల్‌స్పూన్ నూనెను నోట్లోకి తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.ఆపై ఇరవై నిమిషాల పాటుగా మీరు తీసుకున్న నూనె నోట్లోని అన్ని మూలకు వెళ్లేలా పుక్కిలిస్తూ ఉండాలి. ఈ క్రమంలో దీన్ని మింగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. పని పూర్తయ్యాక ఆ నూనెను ఉమ్మివేయాలి. ఇక ఈ ప్రక్రియ ముగిసిన తరువాత ఏదైనా తినేముందు లేదా తాగే ముందు నోటిని శుభ్రపరచుకోవాలని, ఆ తర్వాతే ఆహారం తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆహారం తీసుకున్న తర్వాత సైతం నోటిని శుభ్రపరచుకోవాలని సూచిస్తున్నారు.



# ఒత్తిడిని తగ్గించుకోవచ్చా..

మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నల గురించి అందరూ ఏదో ఒక సమయంలో ఆలోచిస్తారు. ఆరోగ్యకరమైన ఆహారమే వీటన్నింటికీ సరైన సమాధానమని తాజా సర్వేలో తేలింది.మానసిక ఆరోగ్యం కోసం క్లినికల్ ట్రైల్స్‌కి వచ్చిన డేటా ఆధారంగా కొంత మంది ఈ విషయంపై పరిశోధనలు చేశారు. సంతులిత ఆహారం తీసుకుంటే మానసిక ఆరోగ్యంతో పాటు ఒత్తిడి కూడా నియంత్రించుకోవచ్చని తేలింది. ఈ నివేదిక సైకో మెడిక్ మెడిసిన్‌లో ప్రచురితమైంది. ఆరోగ్యకర డైట్ మనుషుల మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఉత్సుకతపై ఎలాంటి ప్రభావం చూపించదు. నిర్దిష్టమైన డైట్ తీసుకునే వాళ్లకి ఉపయోగపడుతుంది. అనవసరమైన ఆహారం తీసుకోవాల్సిన పనిలేదు. బరువు తగ్గడం, కొవ్వు నియంత్రణ, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం లాంటి చర్యలతోనూ మానసిక ఆరోగ్యం కుదుటపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్‌కి బదులు పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలు తీసుకుంటే ఫలితం త్వరగా వస్తుందని ఫిర్త వెల్లడించారు

